సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



చెరకు రైతులారా..
చెరకు క్రషింగ్ సీజన్ సమీపిస్తుండడంతో చెరకు తరలింపుపై రైతులు ఆందోళన చెందనవసరం లేదని ధైర్యం చెబుతూ సుగర్‌కేన్ అధికారులు చర్యలు చేపట్టారు.
- 8లో



బీఎస్‌ఎన్‌ఎల్ ఆవిర్భావ దినోత్సవం
భారతీయ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఆఫ్ ఇండియా 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్యాలయం ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.
- 8లో

నేటి స్పందన రద్దు
విజయనగరం క్రైమ్: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ ఎం.దీపిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సెలవు దినం కావడంతో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలంతా గమనించాలని కోరారు.

న్యూస్‌రీల్

7లోగా కళాకారులు దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురం: జిల్లాలో కళాకారులు గుర్తింపు కార్డుల కోసం ఈ నెల 7వ తేదీ లోగా దరఖాస్తులను సమర్పించాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అర్హులైన కళాకారులకు కొత్త గుర్తింపు కార్డులను జారీ చేయడం జరుగుతుందన్నారు. గుర్తింపు కార్డుల కోసం పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, కులం, కళారూపం, అనుభవం, లింగం (జెండర్), బ్లడ్ గ్రూపు, చిరునామా, గుర్తింపు పొందిన కళాకారుల సంఘం ధ్రువీకరణ పత్రం, మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్, ఇ-మెయిల్ అడ్రస్ తదితర పూర్తి వివరాలతో సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి దరఖాస్తులను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, పార్వతీపురంలో సమర్పించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు రేపు

సీతంపేట: స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయని ప్రిన్సిపాల్ డీఆర్ఎస్ గంగస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ ఎంట్రన్స్ రాసి సీటు రానివారు, సీటువచ్చి కళాశాలలో చేరని వారు పదో తరగతి పాసై, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాయని వారు అర్హులన్నారు. విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. సీటు పొందిన వారు తక్షణమే ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి ఉపకార వేతనం రాదని, మూడేళ్ల పూర్తి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర కళాశాలలో ఇదివరకు ప్రవేశం పొందిన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం లేదన్నారు. వివరాలకు 94405 92447ను సంప్రదించాలని సూచించారు.

మడ్డువలస వద్ద రెండు గేట్ల ఎత్తివేత



ప్రాజెక్టు వద్ద నీటి విడుదల

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద ఆదివారం రెండు గేట్లు ఎత్తివేసి 6500 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో సువర్ణముఖి, వేగావతి నదుల్లో నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో రెండు నదుల నుంచి 6500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి వచ్చి చేరడంతో 64.50 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైంది. దీంతో రెండు గేట్లు ఎత్తి 6500 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నట్లు ఏఈ నితిన్ తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని గజపతినగరం జూనియర్ ఇంటర్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ టెక్నీషియన్ గెస్ట్ ఫ్యాకల్టీ భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీవీఈఓ సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఈసీఈ గ్రూప్‌తో బీఈ/బీటెక్, ఎలక్ట్రానిక్స్‌తో ఏఎంఐఈ 50 శాతం మార్కుల ఉత్తీర్ణత గల విద్యార్హత ఉండాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి బయోడేటాతో పాటు విద్యార్హత ధ్రువీకరణ పత్రం, పదో తరగతి పాస్ సర్టిఫికెట్‌ల జెరాక్స్ కాపీలతో ఈ నెల 4వ తేదీన స్థానిక జిల్లా వృత్తి విద్యాధికారి కార్యాలయానికి సాయంత్రం 4 గంటలకు హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నెలకు గరిష్ఠంగా రూ.పది వేలు వేతనం చెల్లిస్తామని తెలిపారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి

విజయనగరం అర్బన్: వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తున్నామని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జగదీష్ అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలిత ఏడీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రత్యేక వైద్య శిబిరాలను జిల్లాలో మూడు చోట్ల ఏర్పాటు చేసామని తెలిపారు. వృద్ధులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామన్నారు. వీటి ద్వారా బస్సు చార్జీల్లో 20 శాతం రాయితీ పొందవచ్చునని చెప్పారు. ఆస్పత్రిలో పది శాతం పడకలను వృద్ధులకు రిజర్వ్ చేసి నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడమే కాకుండా బ్యాంకుల్లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద కూడా వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని ఆయన చెప్పారు.

జిల్లాలో నిత్యం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం



అలెర్ట్

ప్రజారోగ్యంపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఎక్కడికక్కడ పారిశుద్ధ్య చర్యలు చేపడుతూ ప్రజలను అప్రమత్తం చేస్తూ వ్యాధుల కట్టడికి తన వంతు నిరంతర కృషి చేస్తోంది.

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- పారిశుద్ధ్యానికి పెద్దపీట
- నిర్ణీత సమయంలో వాటర్ ట్యాంకుల క్లీనింగ్
- దోమల నివారణకు ఫాగింగ్
- 2,148 వాటర్ ట్యాంకులు, 312 ఫాగింగ్ యంత్రాలు
- మలేరియా, డెంగీ ప్రబలకుండా ముందస్తు చర్యలు



హోం కంపోస్టు కేంద్రంలో కంపోస్టును తయారు చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

జిల్లాలో వివరాలిలా....

మున్సిపాలిటీలు	02
నగర పంచాయతీ	01
మేజర్ పంచాయతీ	02
మండలాలు	15
రెవెన్యూ గ్రామాలు	955
వాటర్ ట్యాంకులు	2,148
ఫాగింగ్ యంత్రాలు	350

పార్వతీపురం టౌన్: ప్రజల ఆరోగ్య భద్రతపై ఎన్నడూ లేని విధంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వర్షాలు.. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలను ముమ్మరం చేసింది. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి క్షేత్ర స్థాయి నుంచి అధికారులు సమన్వయంతో పని చేసేలా అహగాహన కార్యక్రమాలు, దోమల నివారణా చర్యలను వేగవంతం చేసింది. ప్రధానంగా సురక్షిత మంచినీటిని సరఫరా చేసేలా నిబంధనల మేరకు ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసేలా అధికారులను ఆదేశించింది. సీజనల్ వ్యాధులు విజృంభించకుండా జిల్లా అధికారులు ముందస్తు చర్యల్లో నిమగ్నమయ్యారు. వర్షాల ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడకుండా సరైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. ప్రజలను, ప్రభుత్వ విభాగాల సిబ్బందిని ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేశారు. వలంటీర్లు సచివాలయ సిబ్బంది పారిశుద్ధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో వలంటీర్లు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం కింద ఇంటింటి సర్వేలో వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నారు. చిన్నపాటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించిన మందులు ఇస్తున్నారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో స్పెషలిస్టులతో వైద్య సేవలు అందించనున్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలకు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తున్నారు.

నీటి నిల్వలు లేకుండా..
పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పారిశుద్ధ్య లోపం, కలుషిత నీటి కారణంగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నారు. గృహ పరిసర ప్రాంతాలు, రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ రోగాలు ప్రబలకుండా ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. జిల్లాలోని 2,148 రక్షిత మంచినీటి ట్యాంకులున్నాయి. నిబంధనల మేరకు 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేసే విధంగా చర్యలు ప్రారంభమయ్యాయి.

ముందస్తు చర్యలు
ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో రెండు డెంగీ కేసులు, 246 మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధులు ప్రబలకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. దోమల నివారణకు జిల్లాలోని 350 సచివాలయాలకు ఫాగింగ్ మిషన్లు పంపిణీ చేసింది. దోమల్ని లార్వా దశలోనే నివారించే అబేట్, పెద్ద దోమలను చంపే సైఫునోత్రిన్ వంటి మందులను కూడా సరఫరా చేసింది. క్షేత్ర స్థాయిలో చెత్త నిల్వ లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాలతో పాటు పిడుగులు పడే సమయంలో ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



వర్షాలతో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాం. ట్యాంకుల నుంచి సురక్షిత నీటిని సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశాం. గృహ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, లావా ఉత్పత్తి కాకుండా తగిన మందులను పిచికారీ చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశాం. పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, వాటర్ ట్యాంకులను నిబంధనల మేరకు తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు పర్యవేక్షిస్తున్నాం. ప్రతీపంచాయతీకి ఫాగింగ్ యంత్రాలను పంపిణీ చేశాం. సచివాలయ కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజారోగ్యానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు చేపట్టాం.

– బలివాడ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి, పార్వతీపురం మన్యం

పింఛన్ అందెన్



పట్టణంలో లబ్ధిదారు బురిడి రమణమ్మకు ఆస్పత్రిలో ఫించన్ అందజేస్తున్న వలంటీర్ గౌరి



లబ్ధిదారు సబ్బవరపు గౌరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనిల్

జిల్లాలో వైఎస్సార్ పింఛన్లను ఆదివారం కోడి కూయక ముందే వలంటీర్లు, గృహసారథులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 1,45,015 మంది లబ్ధిదారులకు రూ.39.81కోట్లకు గాను తొలి రోజు 79 శాతం పింఛన్ల నగదును అందజేసినట్టు డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు.

- పార్వతీపురం టౌన్



పట్టణంలో లబ్ధిదారు పట్టెపు లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మణికంఠ

4 నుంచి స్పేస్ వారోత్సవాలు

పార్వతీపురం: వరల్డ్ స్పేస్ వారోత్సవాలను అక్టోబర్ 4 నుండి 8వరకు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరల్డ్ స్పేస్ వారోత్సవాలు సందర్భంగా ఇస్రో నిర్వహించే కార్యక్రమాన్ని ఈ ఏడాది ఉత్తరాంధ్రకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ వారోత్సవాలు విశాఖపట్నంలోని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్నాయని తెలిపారు. వివిధ అంశాలలో పాల్గొనేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారన్నారు. అక్టోబర్ 4న సాయంత్రం 4 గంటలకు ఆర్‌కేబీచ్‌లో జరిగే స్పేస్ వాక్‌కు ఇస్రో చైర్మన్ సోమనాథ్ హాజరవుతారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అక్టోబర్ 2లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పోటీల వివరాలు:
- అక్టోబర్ 6న: క్విజ్ (అంశం: స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ).
  వ్యాసరచన (అంశం: నిత్య జీవితంలో ఇస్రో పాత్ర)
- అక్టోబర్7న: చిత్రలేఖనం
  (అంశం: ఇస్రో ఇన్ స్పేస్)
  పోస్టర్ తయారీ (అంశం: రోల్ ఆఫ్ ఇస్రో)

సర్వజన ఆస్పత్రిలోనే..

అన్ని వైద్య పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు చేసేందుకు రిజిస్ట్రేషన్ చేస్తున్న ల్యాబొరేటరీ సిబ్బంది

- 100 రకాల వైద్య పరీక్షలు
- రోజుకు 2 వేల నుంచి 2500 వరకు వైద్య పరీక్షలు

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రజారోగ్యమే ప్రథమమని గుర్తించిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందుకు తగిన ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులను నాడు – నేడు ద్వారా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించింది. దీంతో రోగులకు వైద్య సేవలన్నీ సకాలంలో అందుతున్నాయి.

విజయనగరం ఫోర్ట్: ప్రజారోగ్యానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రజలకు అవసరమైన వైద్య సేవలన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అందేవిధంగా చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయడం వల్ల జిల్లా ఆస్పత్రి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారింది. దీంతో వైద్య సేవ లు, సిబ్బంది అన్ని రెట్టింపు స్థాయిలో పెరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు కల్పించడం వల్ల రోగులు అధిక సంఖ్యలో వైద్య సేవలు పొందుతు న్నారు. ముఖ్యంగా జబ్బు చేస్తే వ్యాధి నిర్ధారణ ముఖ్యం. వచ్చిన వ్యాధి ఏంటనేది తెలిస్తే దానికి సంబంధించిన చికిత్స అందించడానికి వీలుంటుంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోనే అన్ని రకాల వైద్య పరీక్షలు చేసే విధంగా చర్యలు చేపట్టింది. వైద్య పరీక్షలన్నీ సర్వజన ఆస్పత్రిలో అందుబాటులో ఉండడంతో రోగులు రావడానికి ఆసక్తి చూపుతున్నారు.

100 రకాల వైద్య పరీక్షలు
ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి నిత్యం అధిక సంఖ్యలో రోగులు వైద్యం కోసం వస్తారు. ఓపీ సేవల కోసం రోజుకు 1200 నుంచి 1500 మంది వరకు వస్తారు. వీరిలో 200 నుంచి 250 మంది వరకు వైద్య పరీక్షల కోసం ల్యాబొరేటరీకి వస్తారు. వీరికి 2 వేల నుంచి 2500 వరకు పరీక్షలు చేస్తున్నారు. ఆస్పత్రిలో 100 రకాల పరీక్షలు చేస్తున్నారు. కంప్లీట్ బ్లడ్ పిక్చర్, హెచ్‌బీ, పాలిమ్రోప్స్, లింపోసైటీస్, మోనోసైటీస్, బసోపిల్స్, టీఆర్‌బీసీ, పీసీవీ, ఎంసీవీ, ఎంసీహెచ్, ఎంసీహెచ్‌సీ, ప్లేట్‌లెట్ కౌంట్, ఈఎస్ఆర్, బ్లీడింగ్ టైమ్, క్లాటింగ్ టైమ్, బ్లడ్ గ్రూప్, స్మీర్ ఫర్ ఎంపీ, యూరిన్ హెచ్‌సీజీ, యూరిన్ షుగర్, ఆర్‌బీసీ, క్రిష్టయల్స్, గ్లూకోజ్ పాస్టింగ్, యూరియా క్రియేటిన్, యూరిక్ యాసిడ్, హెచ్‌డీఎల్, ఎల్‌డీఎల్, వీఎల్‌డీఎల్ , బైలురుబిన్, ఏఎస్‌టీ, ఆలుబిన్, డి డైమర్, ఫెర్రిటిన్, ఎఫ్ఏ ఫ్యాక్టర్, హెచ్‌సీవీ, ఎస్.సీఆర్‌పీ, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ, హెచ్‌సీవీ వంటి 100 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు.

థైరాయిడ్, ఎఫ్ఎన్ఏసీ, కల్చర్ పరీక్షలు కూడా..
గతంలో థైరాయిడ్, ఎఫ్ఎన్ఏసీ, బ్లడ్ కల్చర్, యూరిన్ కల్చర్ పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇందుకోసం రోగులు సొంత డబ్బులు వెచ్చించేవారు. ప్రస్తుతం ఈ పరీక్షలు కూడా సర్వజన ఆస్పత్రిలో చేస్తున్నారు. బ్లడ్ కల్చర్, యూరిన్ కల్చర్ కోసం ఆస్పత్రిలో బయో కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసారు.

జ్వరాల విజృంభణ
జిల్లాలో ప్రస్తుతం జ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లెతో పాటు పట్టణాల్లో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నారు. నిత్యం జ్వర పీడితులు ఆస్పత్రులకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి పరీక్షలు చేస్తున్నారు. అన్ని పరీక్షలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు ఉచితంగా అందించడంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

100 రకాల వైద్య పరీక్షలు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే వారికి 100 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నాం. వైద్య పరీక్షలు చేయడానికి అవసరమైన ఆధునాతన పరికరాలను ప్రభుత్వం అందించింది. వైద్య సిబ్బందిని కూడా పూర్తి స్థాయిలో నియమించారు.

– డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

సేవలు బాగున్నాయి..



థైరాయిడ్ లక్షణాలు ఉన్నా యని సర్వజన ఆస్పత్రికి వచ్చాను. అక్కడ వైద్యులు నన్ను పరీక్షించి థైరాయిడ్ పరీక్ష చేసుకోవాలని చెప్పా రు. డాక్టర్ రాసిన చీటి పట్టుకుని వెళ్లే ల్యాబ్ దగ్గర నాకు థైరాయిడ్ పరీక్ష చేసారు. అక్కడికక్కడే సేవలు అందాయి.

– కదంబ సత్యవతి, వైఎస్సార్ నగర్

స్వచ్ఛత జీవన విధానం కావాలి



పార్వతీపురం టౌన్: పారిశుద్ధ్య పనులలో కలెక్టర్ నిషాంత్‌కుమార్



గరుగుబిల్లి: గొట్టివలసలో పరిసరాలను శుభ్రం చేస్తున్న పీఓ విష్ణుచరణ్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం టౌన్: స్వచ్ఛత అందరి జీవన విధానంలో భాగం కావాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆకాంక్షించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం డా.సన్యాసిరాజు స్మారక పురపాలక ఉద్యానవనంలో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ఉద్యానవనంలో చెత్తను శుభ్రం చేయడం, కాలువల పూడిక తీయడం కార్యక్రమాల్లో కలెక్టర్ నిషాంత్‌కుమార్ పాల్గొన్నారు. ప్రహారీ గోడలకు రంగులు, చెట్ల చుట్టూ ఉన్న దిమ్మలకు సున్నం వేసి ఆహ్లాదకరంగా తయారు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ శ్రమదానం నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని తద్వారా మన పనులు సకాలంలో పూర్తి చేయగలమన్నారు. ఒక సంఘంగా ఏర్పడి శ్రమదానం చేయడం వలన మన పరిసరాలలో ఉండే ఉద్యానవనాలు, బహిరంగ ప్రదేశాలు సామాజిక బాధ్యతగా శుభ్రం చేయవచ్చని తెలిపారు. శ్రమ యొక్క గొప్పదనాన్ని (డిగ్నిటీ ఆఫ్ లేబర్) ప్రతీ ఒక్కరు గుర్తించాలని, అప్పుడే చేస్తున్న పని పట్ల చిన్న చూపు ఉండదని ఆయన పేర్కొన్నారు. ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛత హీ సేవను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. శ్రమదానం ఒక ఉద్యమంగా సాగాలన్నారు. అనంతరం ఉద్యానవనం నుండి చర్చి వీధి చివరి వరకు అధికారులు, సిబ్బందితో కలిసి సందర్శించి, స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేసి, కాలువల్లో పేరుకు పోయిన పూడికలను తొలగించి స్ఫూర్తిని, ప్రేరణను కల్పించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలంటూ భారత్ మాతాకీ జై అని నినాదాలు చేశారు. ఉద్యానవనం ఆవరణంలో ముగ్గులు పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ బోను గౌరీశ్వరి, రెడ్ క్రాస్ సంఘం అధ్యక్షుడు డా.మంచిపల్లి శ్రీరాములు, పురపాలక సంఘం కమిషనర్ జె.రామప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత సామాజిక బాధ్యత : పీఓ
గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యతగా భావించాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని గొట్టివలసలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తన వంతు కృషిచేస్తానని సిబ్బంది, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలోని పిచ్చిమొక్కలను, మురుగు నిల్వలను పీఓ స్వయంగా తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క రోజు కార్యక్రమంలా కాకుండా నిత్య జీవితంలో పరిశుభ్రత విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు. గరుగుబిల్లిలో పరిసరాల పరిశుభ్రత ఆవశ్యతకను తెలియజేస్తూ సర్పంచ్ కె.ఇందుమతి ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేసారు. పెదగుడబ, ఉల్లిబద్ర, రావివలస, రావుపల్లి తదితర గ్రామాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం

స్వచ్ఛత, పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి సీహెచ్‌సీ ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి పాల్గొన్నారు. స్వయంగా పిచ్చి మొక్కలను తొలగించారు.

– చీపురుపల్లి



క్లుప్తంగా

పిడుగుపాటుతో ఆవుమృతి



దబ్బగెడ్డ సమీపంలో మృతిచెందిన ఆవు

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ గ్రామం సమీపంలో పిడుగుపాటుకు గురై ఓ ఆవు మృతిచెందింది. కోన గ్రామానికి చెందిన రౌతు సింహాచలం శనివారం పశువులను మేతకు తోలుకుని వెళ్లాడు. సాయంత్రం భోరున వర్షంతో పాటు, పిడుగు పడడంతో, పశువులను ఇంటికి తిరిగి తోలుకుని వచ్చి శాలలో కట్టాడు. అయితే ఆదివారం ఉదయం ఆవులను లెక్కవేయగా, ఒక్క అవు కనిపించక పోవడంతో, రైతు సింహాచలం పశువులు మేత మేసిన ప్రదేశానికి వెళ్లి చూసి, ఆవు మృతిచెందినట్లు గుర్తించాడు. వెంటనే పశువైద్య సిబ్బందికి సమచారం అందించగా వెటర్నరీ ఉద్యోగి రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని, పరిశీలించి పిడుగుపాటుకు గురై ఆవు మృతిచెందినట్లు నిర్ధారించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విజయనగరం క్రైమ్: స్థానిక బాలాజీనగర్ వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న పొదల్లో సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

రైలు కిందపడి విద్యార్థిని ఆత్మహత్య



రైల్వేట్రాక్‌పై రేవతి మృతదేహం

సీతానగరం: మండలంలోని విశాఖ-రాయగడ రైల్వేలైన్‌లో కాశీపేట- చినభోగిలి గ్రామాల మధ్య ఆదివారం మధ్యాహ్నం రైలు కింద పడి చినభోగిలి గ్రామానికి చెందిన విద్యార్థిని చుక్క రేవతి (17) ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు రైల్వే హెచ్‌సీ కృష్ణారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరోగ్య పరమైన సమ్యలను తట్టుకోలేక మనస్తాపం చెందిన రేవతి రైలుకింద పడి ప్రాణాలు తీసుకున్నట్లు మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు చేయగా రైల్వే ఎస్సై రవివర్మ సూచనలతో సంఘటనా స్థలానికి చేరుకుని బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు తెలియజేశారు. సీతానగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రేవతి ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

గ్రూప్-1 విజేతకు ఘనంగా స్వాగతం



గ్రూప్-1 విజేత పావనికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

నెల్లిమర్ల రూరల్: ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో అలుగోలుకు చెందిన కెల్ల ఉదయ పావని డీఎస్పీగా ఎంపికైంది. హైద్రాబాద్‌లో ఉంటున్న పావని గ్రూప్-1 ఉద్యోగం సాధించి తొలిసారిగా శనివారం రాత్రి గ్రామానికి రావడంతో గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ముందుగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. గ్రామస్తులు ఆమెను సత్కరించారు. అనంతరం తల్లిదండ్రులతో పాటు గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

డాక్టర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా ఎమ్మెల్సీ సురేష్ బాబు



డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, ఎమ్మెల్సీ

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్య నారాయణరాజు (సురేష్ బాబు) నియమితులయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం అధికారికంగా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సురేష్ బాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో తన బాధ్యత మరింత పెరిగిందని, అందరి సమన్వయంతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹133	₹236	₹ 246



వెంకటాపురంలో కట్టింగ్‌కు సిద్ధంగా ఉన్న చెరకుతోట



బూర్జలో ఏపుగా పెరిగి పక్వానికి వచ్చిన చెరకుతోట

చెరకు రైతులారా.. ఆందోళన అనవసరం..!

- తూనిక కేంద్రాల స్థాయి పెంపు
- నవంబరు మొదటివారంలోగా క్రషింగ్
- ఏర్పాట్లు చేస్తున్న ఈఐడీ ప్యారీస్

సీతానగరం: చెరకు క్రషింగ్ సీజన్ సమీపిస్తుండడంతో చెరకు తరలింపుపై రైతులు ఆందోళన చెందనవసరం లేదని ధైర్యం చెబుతూ సుగర్‌కేన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని ఎన్‌సీఎస్, భీమసింగి చెరకు కర్మాగారాలు 2023-24 సీజన్‌లో గానుగ నిర్వహించకపోవడంతో ప్రభుత్వం సూచనల మేరకు సంకిలి ఈఐడీప్యారీస్ లిమిటెడ్ యాజమాన్యం రైతులనుంచి నేరుగా చెరకు సేకరణకు ఇంతవరకూ ఉన్న తూనిక కేంద్రాల బరువు స్థాయిని పెంచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈఐడీ ప్యారీస్ కర్మాగారం పరిధిలో 4లక్షల 8వేలు టన్నుల చెరకు, ఎన్‌సీఎస్ కర్మాగారం పరిధిలో 1.లక్షల టన్నులపైచిలుకు, భీమ సింగి సహకార చక్కెర కర్మాగారం పరిధిలో 20 వేల టన్నుల చెరకును రైతులు ఉత్పత్తి చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు చెరకు తరలింపుపై రైతుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడానికి ఈఐడీ ప్యారీస్ లిమిటెడ్ యాజమాన్యం తూనిక కేంద్రాలను ఏర్పాటుచేసి కర్మాగారానికి చెరకు తరలించాలని సంకల్పించింది. ఇదివరలో ప్రభుత్వం ఆదేశాలతో డిప్యూటీ సుగర్‌కేన్ కమిషనర్, ఈఐడీప్యారీస్ యాజమాన్యం ప్రతినిధులు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది ఇంతవరకూ రైతులతో సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు. గతేడాది చెరకు తరలించడంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు 2023-24 క్రషింగ్ సీజన్‌లో పునరావృతం కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

బూర్జ వద్ద 20 టన్నుల తూనిక కేంద్రం..

సీతానగరం మండలంలోని బూర్జ, కృష్ణారాయపురం, పెదంకలాం, వెంకటాపురం, లక్ష్మీపురం, నిడగల్లు, సీతానగరం, పణుకుపేట, అనంతరాయుడుపేట, తామరఖండి, కాశీపేట తదితర గ్రామాల్లో రైతులు చెరకు సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే బొబ్బిలి మండలంలోని కారాడ, పారాది, నారాయణప్పవలస, కోమటిపల్లి, తెర్లాం, బాడంగి మండలాల్లో చెరకు సాగవుతోంది. అదే విధంగా ఎన్‌సీఎస్ కర్మాగారం పరిధిలో రైతులు 1టన్నుకు పైగా చెరకు పండిస్తున్నారు. ఈ మేరకు ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం మూతపడినప్పటి నుంచి ప్రభుత్వం తీసుకున్న చొరవ కారణంగా ఈఐడీప్యారీస్ లిమిటెడ్ చక్కెర కర్మాగార యాజమాన్యం ఇక్కడి నుంచి చెరకు సేకరిస్తోంది. ఈ నేపథ్యంలోనే రైతుల నుంచి చెరకు సేకరిస్తామని అగ్రిమెంట్ చేసింది. గతంలో ఉన్న చెరకు తూనిక కేంద్రాలతో పాటు సీతానగరం మండలంలోని బూర్జలో 20 టన్నుల తూనిక యంత్రం, ఏగోటివలస, బొబ్బిలి మండలం బొడ్డవలస, రంగరాయపురం ప్రాంతాల్లో అదనంగా తూనిక కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఈఐడీప్యారీస్ యాజమాన్యం నిర్ణయించింది.



20 మెట్రిక్‌టన్నుల బరువు తూచేందుకు ఏర్పాటచే చేసిన తూనికయంత్రం

వేగవంతంగా చెరకు తరలించడానికి చర్యలు..

ఈఐడీప్యారీస్ ఇండియాలిమిటెడ్ యాజమాన్యం ఈనెలాఖరులేదా నవంబరు మొదటి వారంలోగా క్రషింగ్ ప్రారంభించడానికి చర్యలు తీసుకుంది. లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ కర్మాగారం పరిధిలో రైతులు పండించిన చెరకుకు సకాలంలో కట్టింగ్ ఆర్డర్లు ఇచ్చి, కర్మాగారానికి చేరవేయడానికి అనుకూలంగా లారీలను ఏర్పాటు చేస్తాం. చెరకు సాగు విస్తీర్ణం, రవాణా సౌకర్యాల ఆధారంగా తూనిక కేంద్రాల ఏర్పాటు చేపడుతున్నాం. సీతానగరం మండలం బూర్జలో ఇప్పటివరకూ 10 టన్ను చెరకు తూకానికి సరిపడిన తూనిక యంత్రానికి బదులుగా 2023-24 క్రషింగ్ సీజన్‌లో 20 టన్నుల బరువు చెరకును తూకం వేస్తాం. లక్ష్మీపురంలో కొత్తగా చెరకు తూనిక యంత్రాన్ని నెలకొల్పుతున్నాం. ఏగోటివలస, బొబ్బిలి మండలం పక్కి రంగరాయపురం, మక్కువ మండలం వెలగవలస ప్రాంతాల్లో తూనిక కేంద్రాలు ఉన్నాయి.

– మురళి, ఏజీఎం, ఈఐడీప్యారీస్‌లిమిటెడ్

రెండు కర్మాగారాల పరిధిలోని చెరకు క్రషింగ్



జిల్లాలో భీమసింగి, ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారాల పరిధిలో రైతులు ఉత్పత్తి చేసిన చెరకును ప్రభుత్వ సూచనలమేరకు పూర్తిస్థాయిలో ఈఐడీ ప్యారీస్ యాజమాన్యం తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేసింది. రైతులు చెరకు తరలింపుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రెండు ప్రాంతాల రైతులనుంచి చెరకు సేకరిస్తారు. ఇప్పటికే గ్రామాల్లో చెరకు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశాం.

– జీవీవీ సత్యనారాయణ, సుగర్‌కేన్ డిప్యూటీ కమిషనర్, బొబ్బిలి

రాజన్నదొరకు ధన్యవాదాలు



పైడిరాజును సన్మానిస్తున్న పెద్దలు, నాయకులు

సాలూరు: అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సహాయసహకారాలు అందించిన ఉపముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్న దొరకు కొలంబోలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన కనకల పైడిరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. అంతర్జాతీయ పోటిల్లో రాణించిన ఆమెను ఆమె కన్నవారి ఊరైన సాలూరు మండలంలోని మామిడిపల్లి గ్రామంలో నాయకులు, ప్రజలు ఆదివారం సన్మానించారు. జీవితంలో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధ్యాయుల శిక్షణ, తల్లిదండ్రులు, పెళ్లయిన తరువాత భర్త, అత్తమామలు, తాను ఉద్యోగం చేస్తున్న యాజమాన్యం సహాయ సమకారాలతోనే అంతర్జాతీయస్థాయి వరకు వెళ్లగలిగానని సంతోషం వెలిబుచ్చింది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామపెద్దలు జర్జాపు ఈశ్వరరావు, నీలిమ, సువ్వాడ గుణవతి, రామకృష్ణ, తాడు, చినబాబు, సుధాకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్న శ్రీను సోల్జర్స్ నూతన కార్యవర్గం



వికలాంగుడికి ట్రై సైకిల్‌పంపిణీ చేస్తున్న చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్ష, కోశాధికారులు సిరి సహస్ర, సాయి మోహిత్‌లు

విజయనగరం: ప్రజాసేవే పరమావధిగా స్థాపించిన చిన్న శ్రీను సోల్జర్స్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. నగరంలోని ప్రదీప్‌నగర్‌లో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా మజ్జి సిరి సహస్ర, కోశాధికారిగా మజ్జి సాయి మోహిత్‌లు నియామకమ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తండ్రి పేరు మీద నెలకొల్పిన సంస్థకు అన్ని విధాలా, అన్నివేళలా తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. మంచిని పంచుదాం అనే నినాదంతో విజయనగరం జిల్లా వ్యాప్తంగా పలు మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నగరంలోని పులిగడ్డ వారి వీధికి చెందిన వికలాంగుడు వెంకటరావుకు ట్రై సైకిల్ పంపిణీ చేసి..సంస్థ సభ్యులందరికీ అధ్యక్షురాలు సిరి సహస్ర జ్ఞాపికలు బహూకరించారు.

గ్రామాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దూరం



కొండకొత్తవలసలో ర్యాలీలో పాల్గొన్న వీసీ కట్టిమణి

దత్తిరాజేరు: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దూరమవుతాయని ట్రైబల్ యూనివర్సిటీ వీసీ కట్టిమణి అన్నారు. ఈ మేరకు మండలంలోని మర్రివలస వద్ద యూనివర్సిటీ నిర్మాణ సరిహద్దు గ్రామమైన కొండకొత్తవలసలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామపెద్దలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి కలుపు మొక్కలు తీసి వీధులలో చెత్తాచెదారాలు లేకుండా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల నుంచి పెద్దల వరకు ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలలో చెత్తాచెదారాలు లేకుండా చేస్తే దోమలు, ఈగలు చేరకుండా ఉండడంతో ఆరోగ్యంగా ఉంటారని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక డిమాండ్



ఉద్యమ నినాదంతో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

విజయనగరం అర్బన్: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ జిల్లా పర్యటన అనంతరం కొందరు ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక ఏపీటీఎఫ్ (259) భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో డిమాండ్ చేశారు. చిన్న చిన్న కారణాలను ఎత్తి చూపుతూ మెమోలు, షోకాజ్‌లు ఇస్తూ, సస్పెన్షన్ విధించడం వంటి పలు అంశాలపై ఉమ్మడి వేదిక చర్చించింది. సస్పెన్షన్‌లను ఎత్తివేయకపోతే ఉమ్మడి కార్యచరణ ద్వారా ఉద్యమానికి ముందుకు వెళ్లాలని తీర్మానించింది. తొలుత విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, డి.శ్యామ్, ఎస్ఎస్‌దొర, వి.రమణ, ఎస్.భాస్కర రావు, మజ్జి రమేష్, ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

10 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

దత్తిరాజేరు: మండలంలోని గడసాంలో జరిగిన సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశం నుంచి వెళ్లిపోయిన 10 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని ఎంఈఓ ఎం. వెంకటరావు ఆదివారం తెలిపారు. గత నెల 27న దత్తిరాజేరు, మొరకముడిదాం మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు గడసాం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సబ్జెక్ట్ కాంప్లెక్స్ పరిశీలనకు సాయంత్రం ఐదు గంటల సమయంలో డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీ వెళ్లి పరిశీలించారు. ఆ సమయంలో పదిమంది ఉపాధ్యాయులు లేకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

రేపటి నుంచి ఎఫ్‌ఏ-2 పరీక్షలు

- 10న ఆన్‌లైన్‌లో ఫలితాలను అప్‌లోడ్ చేయాలి
- తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థి ప్రోగ్రెస్ వివరించాలి
- బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ



బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ

విజయనగరం అర్బన్: జిల్లాలో మంగళవారం నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)-2 పరీక్షలను పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తోందని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను వెలడించారు. జిల్లాలో అన్ని యాజమన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్దేశించిన సిలబస్ ప్రకారం పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్ష జరిగే రోజు ప్రశ్నపత్రాలను మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులకు పంపిస్తారు. పరీక్షకు గంట ముందు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ప్రశ్నాపత్రాలు పంపాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎంఈఓలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. 9, 10 తరగతుల విద్యార్థులకు రోజుకు రెండు పరీక్షలు ఉదయం నిర్వహిస్తారు. అదే విధంగా 6, 7, 8 తరగతుల విద్యార్థులకు మధ్నాహ్నం పరీక్షలు ఉంటాయి. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతుల విద్యార్థులకు ఉదయం ఒకటి, మధ్యాహ్నం మరో పరీక్ష నిర్వహిస్తారు. 10వ తేదీ లోగా సమాధాన పత్రాలను మూల్యాంకనం పూర్తి చేసి విద్యార్థులకు అందజేయాలి. ఆ వెంటనే ఫలితాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకోవాలి. అదే తేదీన తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రోగ్రెస్ వివరించాలని డీఈఓ ఆదేశించారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

పాలకొండ రూరల్/వీరఘట్టం: వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వ్యక్తిపై పిడుగు పడడంతో మృత్యువాతపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం మండలం తెట్టంగి గ్రామానికి చెందిన మొదిలి సింహాచలం(37) పాలకొండ మండలం నవగాం గ్రామానికి వచ్చాడు. వర్షం పడుతుండడంతో గ్రామానికి సమీపంలో ఉన్న వైన్ షాపు దగ్గర చెట్టు మొదట్లో నిలబడ్డాడు. ఈ క్రమంలో వర్షంతో పిడుగు పడడంతో సింహాచలం కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. అదేసయమంలో సమీపంలో ఉన్న వారజాసి సంతోష్, బండి బంగారుబాబు, బోనెల శ్రీనివాసరావులు పిడుగు ధాటికి పగిలిన గాజు సీసా ముక్కలు గుచ్చుకుని గాయాలపాలయ్యారు. క్షతగాత్రులు నవగాం గ్రామానికి చెందినవారు. ఈ ప్రమాదంపై స్థానికులు 108కి సమాచారం అందించగా పైలెట్ లావేటి చంద్రం, ఈఎంటీ ఎ.శ్రీనివాసరావులు క్షతగ్రాతులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే సింహచలం మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదుచేశారు.



ఘటనా స్థలంలో అపస్మారక స్థితిలో సింహాచలం

ఆగిఉన్న లారీని ఢీకొని వ్యక్తి..

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి సాలూరు మండలం కుద్దాడ గ్రామానికి చెందిన ఉయ్యాల రాము, మరో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై సాలూరు నుంచి పి.కోనవలస వస్తుండగా గంగన్నదొర వలస సమీపంలో ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారులు ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఉయ్యాల రాము మృతిచెందాడు, దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు.

వేడుకగా బీఎస్‌ఎన్‌ఎల్ 24వ ఆవిర్భావ దినోత్సవం



4జి సిమ్‌కార్డులు, ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు

విజయనగరం టౌన్: భారతీయ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఆఫ్ ఇండియా 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్యాలయం ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఎస్‌ఎన్‌ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ప్రారభించారు. ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా చిన్నారులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు 4జి సిమ్‌కార్డు వ్యాలిడిటీతో అందజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రంతో పాటూ75 మంది విద్యార్థులకు 4జి సిమ్ కార్డులు అందజేశారు. బీఎస్‌ఎన్‌ఎల్ అభివృద్ధికి సంస్థ ఉద్యోగులందరూ సహకరించాలని, వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆలుగు వెంకటరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, మురళీధర్, జగదీష్‌లతో పాటు ఎస్‌ఎఫ్‌టీఈ కార్యదర్శి అప్పారావు, బీటీఈయూ కార్యదర్శి మాలికో, సభ్యులు శకుంతల, సుజాత, సంగీత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



మక్కువలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మావుడి రంగునాయుడు, ఆటోడ్రైవర్లు

మక్కువ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహనమిత్ర పథకం ఆటోడ్రైవర్లకు వరంలాంటిదని వైఎస్సార్ సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రధానరహదారి వద్ద ఆదివారం ఆటోయూనియన్ల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఏదోవిధంగా మేలు చేయాలన్న సంకల్పంతో, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆటోడ్రైవర్లను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. పేదవాడి కోసం పరితపిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు.

గాజు సీసాలో 'గాంధీ'

కొత్తవలస: మండలంలోని దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న జి.పరమేశ్వరరావు గాజు సీసాలో మహాత్మా గాంధీ చిత్రాన్ని గీసి అబ్బురపరిచారు. అక్టోబర్2న గాంధీ జయంతి సందర్భంగా ఈ బొమ్మ గీసినట్లు ఆయన తెలిపారు. దీంతో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పరమేశ్వరరావును అభినందించారు.



గాజుసీసా లోపలి భాగంలో గీసిన మహాత్మాగాంధీ చిత్రం



డ్రాయింగ్ టీచర్ పరమేశ్వరరావు

రాష్ట్రస్థాయి పోటీలకు సీతంపేట విద్యార్థులు



రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సీతంపేట: ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల్లో స్విమ్మింగ్, హాకీలో ప్రతిభ చూపిన స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 9వ తరగతి విద్యార్థి కె.ప్రదీప్ స్విమ్మింగ్‌కు, 8 వతరగతి చదువుతున్న లిల్లీవరప్రశాంత్ హాకీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడంతో హెచ్‌ఎం హేమసుందర్‌తో పాటు పీడీ, పీఈటీలు అభినందించారు.

జాతీయ రోప్‌స్కిప్పింగ్ పోటీలకు కాపుశంభాం విద్యార్థులు



జాతీయస్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కాపుశంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న చందక ప్రణీత, ఆరోతరగతి చదువుతున్న పైల చంద్రమౌళి జాతీయస్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీలకు ఎంపికయ్యారు. గత నెలలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థినులు ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని నాశిక్‌లో అక్టోబర్2 వరకు జరగనున్న జాతీయస్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రాము, పీడీ ఎం.ఉదయ్‌కుమార్, గ్రామపెద్దలు అభినందించారు.